చెన్నూరు
జి.నారాయణరావు.






నేను సుజనరంజనిలో ఎప్పుడూ తప్పకుండా చదివే శీర్షిక "మాఊరు" ఇందులో చాలామంది ప్రముఖులు వాళ్ళ ఊళ్ళ గురించి చాలా ఆప్యాయంగా వారి మధురానుభూతులను వివరించారు. ఇందులో కొన్ని ప్రశస్తమైన దేవాలయాలున్న ఊళ్ళు. కొన్నింటినుండీ ప్రసిద్ధిగాంచిన వ్యక్తులు ఉద్భవించారు. మా ఊరు దీనికి భిన్నమైన విధంగా ప్రసిద్ధిగాంచింది. ఎందుకో చూద్దాం.

మా ఊరు ఖమ్మం జిల్లాలోని కల్లూరు మండలంలో ఉంది. ఊరు పేరు చెన్నూరు. ఈ ఊరు ఖమ్మం జిల్లాలోనూ, ప్రక్కన ఉన్న క్రిష్ణాజిల్లాలోనూ ప్రసిద్ధి. నేను 50 సంవత్సరాల క్రితం ఈ ఊరిలో పుట్టాను. ఇది చుట్టుప్రక్కల గ్రామాలతో పోలిస్తే పెద్ద ఊరు. మా ఊరిలో నా చిన్నప్పటికే స్కూలు ఉండేది. నా చిన్నప్పుడు మా మిడిల్ స్కూలును హైస్కూలుగా మార్చడం గుర్తుంది. మా ఊరిలో గవర్నమెంటు పశువైద్యశాల కూడా ఉండేది. చుట్టుప్రక్కల గ్రామాలవాళ్ళు చీరల వ్యాపారం గురించీ, పశువైద్యం గురించి మా ఊరు వస్తుండేవారు. మా ఊళ్ళో అందరూ దాదాపు మధ్యతరగతి వ్యవసాయదారులు. ఎవ్వరికీ ట్రాక్టర్లు వుండేవికావు. వకీలు గారికి ఒక్కళ్ళకే డాబా వుండేది. కొన్ని పెంకుటిళ్ళు తప్ప మిగిలినవన్నీ గుడిసెలే. వ్యవసాయం ముఖ్యమైన వృత్తి.

మా ఊరి భూములకు నీటి సౌకర్యం అప్పట్లో అంతంత మాత్రంగా వుండేది. రెండు చెరువులున్నప్పటికీ అవి రెండుసార్లు నిండితే తప్ప ఒక్క పంటకు కూడా గ్యారెంటీ వుండేదికాదు. ఎన్నోసార్లు నా చిన్నప్పుడు వరిపొలాలు నీరు అందక ఎండిపోయేవి. రైతులు విపరీతమైన నష్టానికి గురి అయ్యేవారు. నాగార్జునసాగర్ కాలువలు వచ్చిన తర్వాత మాత్రమే పరిస్థితి మారింది. చిన్నతనంలో అతి భీకరమైన కరువులు చూసాను. చాలామంది వలసపోయారు. బయట దేశాల నుండీ కొన్ని మత సంఘాలు పంపబడిన గోధుమలు, వెజిటబుల్ ఆయిల్ (గడ్డినూనె అంటుండేవాళ్ళు)తో కొంతమంది కొంతకాలం వెళ్ళబుచ్చేవాళ్ళు.

మాబడి రెండుపాకలలో నిర్వహింపబడేది. మా స్కూల్లో వసతులు లేక చెట్లక్రింద క్లాసులు నడిపేవారు. వర్షం వచ్చినప్పుడు కప్పులు లీక్ అవుతుండేవి. ఆరోజుల్లో స్కూలు మూసేసేవారు.అందుకే ఆ చదువును వానాకాలం చదువు అంటూ వుండేవారనుకుంటాను. మా స్కూల్లో టీచర్లు ఉండేవారు కాదు. సైన్సు, ఇంగ్లీష్, లెక్కల టీచర్ల పోస్టులు ఎప్పుడూ ఖాళీగా వుండేవి. హిందీ టీచర్ ఆర్.ఎం.పి వైద్యం చేస్తాడు కాబట్టి సైన్సు పాఠాలు చెప్పమనేవారు. ఉన్న టీచర్లలో చాలామందికి ముఖ్యమైన వృత్తి వ్యవసాయం. ఒక టీచర్ పోస్ట్‌మాస్టర్, ఒకరు ఆర్.ఎం.పి వైద్యం చేస్తుండేవారు. చదువు చెప్పడంలో అస్సలు ఆసక్తి ఉండేది కాదు. కొద్దిమందికి పేకాట ముఖ్యమైన వృత్తిగా వుండేది. ఒక టీచర్ లోకల్ లీడర్ వాళ్ళ బావమరిది. ఇంగ్లీష్ సరిగ్గా చెప్పడం లేదని నేను కంప్లైంట్ చేస్తే పెద్ద రబస చేసాడు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌టీచర్ ఉండేవాడు కాదు. మేమే బాల్ బ్యాడ్మింటన్ కోర్టు వేసుకుని ఆడుతుండేవాళ్ళం. నెట్‌కోసం ఉడెన్ పోల్స్‌ను ఎప్పుడూ ఎవరో ఎత్తుకునిపోతూ ఉండేవాళ్ళు. మేము అన్నింటినీ ప్రతిరోజూ స్కూల్లో పెట్టి తాళం వెయ్యాల్సి వచ్చేది. స్కూల్ మూడు

ఎకరాల స్థలంలో ఉండేది. కాంపౌండ్ గోడకానీ, రక్షణకానీ లేకపోవడంతో ఈజాగాలను బహిర్భూమిగా కూడా వాడుకునేవాళ్ళు. హరిజనవాడ దగ్గరలో ఉండటం వలన చనిపోయిన జంతువులను చర్మం తియ్యడానికి వాడుకుంటుండేవాళ్ళు. చాలా పెద్ద పెద్ద రాబందులను నేను నిజజీవితంలో అక్కడే చూసాను. ఒకసారి ప్రొద్దుటే ఎవరో బహిర్భూమిగా స్కూలు ప్రదేశాన్ని వాడుకుంటూ ఉంటే కొంతమంది స్టూడెంట్స్ అతన్ని హెచ్చరించడానికి దగ్గరగా వెళ్ళాడు. వాడు ఒక గేద తుంటె ఎముకతో వాళ్ళను బెదిరించాడు.

అప్పుడు 10 వ తరగతి మా స్కూల్ మొట్టమొదటి బ్యాచ్ పబ్లిక్ పరీక్ష కొరకు ఖమ్మం వెళ్ళింది ఆ పరీక్షలో ఎవ్వరూ పాస్ కాలేదు. దానికి హెడ్‌మాస్టర్ సత్యనారాయణగారిని అందరూ తలా ఒకమాట అన్నారు. ఎటువంటి పునాది లేకుండా, మంచి శిక్షణ లేకుండా ఎలా ఎవరైనా పాస్ అవగలరు? వ్యక్తిగత కక్షల వలన అప్పట్లో మా పాకలను మూడుసార్లు తగలపెట్టారు. టీచర్లు లేకపోయినా నాకు నేను చదువుకుని టెన్త్‌క్లాస్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను.

అప్పట్లో మా ఊరిలో ముఖ్యమైన కాలక్షేపం చాలామందికి పేకాట, కొట్లాటలు, వాళ్ళ మీద వీళ్ళు, వీళ్ళమీద వాళ్ళు కబుర్లు చెప్పుకోవడం. శ్రద్ధగా వ్యవసాయం చేసుకునే రైతులు కొద్దిమంది మాత్రమే. నా ముఖ్యమైన స్నేహితులు ఇప్పటికీ నాకు తెలిసినంతవరకు పేకాటను ప్రాణంగా ఎంచుకున్నారు. ఎన్నో పెద్ద కుటుంబాలు పేకాటలో చితికిపోయాయి. పిల్లలు ఎటూకాకుండా అయిపోయారు. నా చిన్నతనంలో మా ఊరి ప్రెసిడెంటు కందిబండ జగన్మోహన్‌గారు విపరీతంగా పేక ఆడేవారు. ఈ పేకాట వలన ఆరోగ్యం దెబ్బ తిని గ్యాస్ట్రిక్ అల్సర్ పెర్‌ఫొరేట్ అయి చనిపోయారు. వేరే ఊరు వాళ్ళు మా ఊరు రావతం, మా ఊరివాళ్ళు వేరే ఊళ్ళకు వెళ్ళి ఆడుతుండేవారు.

మా ఊరు కల్లూరు - మధిర మార్గంలో ఉంది. కృష్ణాజిల్లా తిరువూరు నుండీ ప్రైవేటు బస్ సర్వీస్ కల్లూరు మీదుగా మధిర వెళుతుండేది. అది ఏరోజు వస్తుందో ఏరోజు రాదో ఎప్పుడు వస్తుందో తెలిసేది కాదు. చాలామంది నడవటం లేదా సైకిళ్ళను నమ్ముకునేవారు. నేను ఇంటర్ ఫస్ట్ ఇయర్ మధిరలో చదువుకునేటప్పుడు ఇంటికి రావాలంటే పెనుగొలను నుండీ 12 మైళ్ళు నడిచి రావాల్సివచ్చేది.

నేను చాలా పెద్దయ్యాక అంటే 1976 - 1977 లో కరెంట్ వచ్చింది. అప్పటివరకు కిరోసిన్ దీపాల వెలుగులోనే చదువుకునేవాళ్ళం. ఆరుబయట మంచాలమీద గాలికోసం పడుకోవాల్సివచ్చేది. ఎన్నోసార్లు ఎవరెవరో తగాదాల తోటి అరుపులు, తిట్లతో నాకు మెలుకువ వచ్చేది. రాత్రి పొద్దు పోయేదాకా తిట్లు వినపడుతుండేవి. కొంతమంది గ్రామస్థులు నాటుసారా బాగా త్రాగేవాళ్ళు వాళ్ళు రాత్రి బాగా పొద్దుపోయేదాకా తిట్టుకుంటూ ఉండేవాళ్ళు. చిన్నప్పుడు తిట్లు విని విని నాకు కూడా చిన్నప్పుడు తిట్లు దొర్లేవి. నేను గాంధీ మెడికల్ కాలేజీలో చదువుకొంటున్నప్పుడు మా ఫ్రెండ్స్ నేను ఎప్పుడైనా 2,3రోజులు మా వూరు వెళ్ళివచ్చిన సంగతి గుర్తుపట్టేవారు. ఎలాగంటే నా మాటల్లో తెలియకుండా తిట్లు దొర్లేవట. ఎన్నో ఎన్నో పెద్ద పెద్ద కొట్లాటలు ప్రత్యక్షంగా చూసాను. మధిర తాలుకా కోర్టులో అత్యధిక సంఖ్యలో కేసులు మా ఊరివి ఉండటం వలన ఒక విభాగం మా ఊరి గురించి ఉండేదట.

పొలాల్లోని వ్యవసాయ పరికరాలు, తాళ్ళు, వరికట్టలు తరచుగా దొంగలించేవారు కొంతమంది పొలాల ప్రక్కన భూములుండటం భయపడేవారు. వాళ్ళు పచ్చి దొంగలు. నా చిన్నప్పుడు మా వేరుశెనక్కాయల లారీని మాకళ్ళ ఎదుటే మా గ్రామస్థులు దోచుకున్నారు. మా నాన్న పోలీసుల సహాయంతో కొన్ని బస్తాలను రికవరీ చేయగలిగారు. అరుగుమీద ఉంచిన పెసల బస్తాలను వేరేవాళ్ళు దొంగిలించారు. ఎదుటివాడు నష్టపోతే సంతోషించేవాళ్ళు చాలామంది ఉండేవాళ్ళు.

ఒకసారి కాంగ్రెస్‌వాళ్ళు ఒక ఇంట్లో సమావేశమవుతుంటే వేరే పార్టీవాళ్ళు దాన్ని చెడగొట్టాలని చూసారు. అప్పుడు కాంగ్రెస్‌వాళ్ళు లోన గడియపెట్టారు. వేరే పార్టీ వాళ్ళు కప్పు ఎక్కి పెంకులు తొలగించి లోనికి దిగాలని చూసారు. కల్లూరు నుండీ పోలీసులు రావడం వలన ప్రశాంతంగా వాళ్ళ మీటింగ్

ముగిసింది. జలగం వెంగళరావుగారు హోం మినిస్టరుగా పర్యటనకు వచ్చినపుడు ఆయన మీద మా ప్రక్క మళ్ళా రాళ్ళు వేసారు. అంటే మా ఊరి సంస్కృతి ప్రభావం చుట్టు ప్రక్కల ఉండేది. మా ప్రాంతాల్లో ఏదైనా ఉత్సవం జరిగినప్పుడు ప్రభ బండ్లు (ఎడ్ల బండ్లను చాలా రంగురంగులుగా అలంకరించి వెదురుతో ఎత్తుగా ప్రభలు నిర్మించి) ఊరేగింపు జరిగేది. కల్లూరులో ఒకసారి జలగం వెంగళరావుగారి మీటింగ్ అయినపుడు మా చుట్టుప్రక్కల గ్రామాల వాళ్ళు ఈ వూరేగింపు మా ఊరిమీదుగా వెళుతుండగా వేరేపార్టీవాళ్ళు రాళ్ళతో కర్రలతో ఎటాక్ చేసారు. ఈ దురాగతాన్ని నేను స్వయంగా చూసాను. ఎందరి తలలో పగిలిపోయాయి. అదృష్టవశాత్తు ఎవరూ చనిపోలేదు. ఎంతో రక్తస్రావాన్ని కళ్ళారా చూడటంతో నేను చలించిపోయాను. వెంగళరావుగారిని కొంతమంది ప్రజలు గట్టిగా అభ్యర్థించడంతో పోలీస్స్టేషన్ మాఊరిలో పెట్టించారు. అది మా ఇంటికి ఎదురుగా ఉన్న ఇంట్లో టెంపరరీగా పెట్టారు. మాఊరి ప్రెసిడెంట్ మనిషిని ఎవరో కొట్టారని అనుమానంతో వాళ్ళని స్టేషనుకు తీసుకువచ్చి చితకబాదుతూంటే వాళ్ళు అరిచే అరుపులకు ప్రక్కింటి పిల్లలు భయంతో ఏడవటం నాకు బాగా గుర్తు. నా చిన్నప్పుడు ఒక చెత్త ఆనవాయితీ మా ఊళ్ళో ఉండేది. వినాయక చవితి నిమజ్జనం రోజు ఇంటిమీద రౌడీలు రాళ్ళు వేయడం. ఈ ఆనవాయితీ ఏఊళ్ళోనూ ఉన్నట్లు నేను వినలేదు. మా ఇంటికి ఎదురుగా ఉన్న గొండేల జగన్నాధంగారి ఇంటికప్పు ఇనుపరేకులతో ఉండేది. దానిమీద రాళ్ళు వేస్తున్నప్పుడు వచ్చే శబ్దాలకు రౌడీలు తెగ ఆనందపడేవాళ్ళు. ఒకసారి కొంతమంది పోలీసు కేసు పెట్టారు. నిందితులను గుర్తించి వారిని శిక్షించాలని ఇటువంటివి పునరావృతం కాకూడదని వారి ఉద్దేశ్యం. అయితే ముఖ్య బాధితుడు జగన్నాధంగారు భయంతో కేసు నమోదు చెయ్యటానికి ముందుకు రాలేదు. అందువలన ఏమీ చెయ్యలేకపోయారు.

పొరుగు వాళ్ళు మా ఊరికి ఏదైనా అమ్ముకోటానికి రావాలన్నా జంకుగా ఉండేవాళ్ళు. ఒకసారి వంటపాత్రలమీద పేర్లు వ్రాసే అతను వచ్చినపుడు మా ఊరి వాళ్ళు ఏడిపించటం నేను చూసాను. అందువలనే మా ఊరు చాల ప్రసిద్ధం. పైవే కాకుండా ఎన్నో ప్రతికూల పరిస్థితులలో కూడా నేను బాల్యాన్ని బాగా ఎంజాయ్ చేసాను. నేను ప్రతి క్షణం ఏదో ఆటలాడుతుండేవాడిని. తిరగని వాగూ వంకా లేదు. బాగా కష్టపడి చదవటం వలన ఇంటర్మీడియట్ నుండీ డైరెక్టుగా మెడిసిన్‌లో సీటు దొరికింది. హైదరాబాద్ వచ్చేసాను. మా ఊరిలో నా బాల్యంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసారు. అప్పుడు రాష్ట్రం నుండే కాక దేశంలోని ప్రముఖ నాయకులు విచ్చేశారు. ప్రసిద్ధమైన కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అది ఒక మరిచిపోలేని అనుభూతి.

తరువాత ఎన్నో సంవత్సరాలకు గవర్నమెంట్ ఆర్టీసి బస్సు సర్వీస్ మొదలయింది. కరెంట్ వచ్చింది. నాగార్జు సాగర్ నీళ్ళు రావటం వలన ఒక పంట అయినా గ్యారెంటీ అవ్వడం మొదలయింది. కొన్ని బిల్డింగ్స్ వచ్చాయి. ట్రాక్టర్స్ కొన్ని ఇళ్ళముందర కనపడసాగాయి. జనం ఇంకా కాఫీ హోటళ్ళ దగ్గర గుమికూడి పిచ్చాపాటీ మాట్లాడుకుంటూనే ఉన్నారు. స్కూలుకు రెండు చిన్న పక్కా బిల్డింగ్స్ కట్టారు. నాఫ్రెండ్స్ పేకాటను జోరుగా ఆడుతూనే వున్నారు.




నారాయణ రావు గారు గాంధీ మెడికల్
కాలేజీనుండి ఉత్తీర్ణులయ్యారు.
ఇప్పుడు Mount shastaలో Internal
Medicine practice చేస్తున్నారు.
వీరికి ఇద్దరు పిల్లలు. అమ్మాయి
హార్వర్డ్ యూనివర్సిటీలోని డెంటల్
కాలేజ్‌లో రెండవ సంవత్సరం
చదువుతోంది. అబ్బాయి
శాండియాగోలోని మోటరోలా
కంపెనీలో కంప్యూటర్ ఇంజినీర్‌గా
పనిచేస్తున్నాడు.